సాక్షి నంద్యాల

మంగళవారం । 30 । జూలై । 2024



నీటి విడుదల పెంపు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నీటి విడుదలను పెంచారు. సోమవారం ఆరు గేట్లు మూడు అడుగుల మేర ఎత్తి ఎస్సార్బీసీకి 23 వేల క్యూసెక్కులు విడుదల చేశారు.



కుందూనది పరవళ్లు

దొర్నిపాడు: కృష్ణా జలాలతో కుందూనదికి జలకళ వచ్చింది. పోతిరెడ్డిపాడు నుంచి నదికి నీరు విడుదల చేశారు. నది పరీవాహక ప్రాంత రైతులు వరి సాగుకు సమాయత్తమవుతున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,630.98
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:97.410
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,56,780
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,56,248

న్యూస్‌రీల్

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం పరమేశ్వరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి ఆలయ క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూ లైన్లు నిండి పోయాయి. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించి చర్యలు చేపట్టారు. పలువురు భక్తులు మల్లన్నకు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో ఖాళీగా ఉన్న జూనియర్ సహాయకులు, కార్యాలయ సహాయకుల పోస్టుల్లో నాలుగింటిని కారుణ్య నియామకాల కింద భర్తీ చేసినట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆదేశాల మేరకు జూనియర్ సహాయకులుగా పీ అభిలాష్ నిరంతర్‌ను సంజామల మండలం జెడ్పీహెచ్ఎస్ పేరుసోములకు నియమించామన్నారు. జీ సతీష్ కుమార్‌రెడ్డిని అదే మండలం నొస్సం జెడ్పీహెచ్ఎస్‌కు, కే కార్తికేయన్‌ను కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయానికి నియమించామన్నారు. బీ మధుకు డోన్ మండల పరిషత్ కార్యాల కార్యాలయ సహాయకులుగా పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు.


తిథి భోజనాలు విజయవంతం



చాగలమర్రి మండలం గొడిగనూరులో తిథి భోజనాలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): శిక్ష సప్తాహ్‌లో భాగంగా చివరి రోజు సోమవారం జిల్లాలో చేపట్టిన తిథి భోజనాల కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పీఎం పోషణ్, డొక్కసీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో గ్రామస్తులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సంతోషాన్ని పంచుకునే కార్యక్రమమే తిథి భోజనమన్నారు. జిల్లాలోని 1,370 పాఠశాలల్లో పండుగలా ఈ కార్యక్రమం జరిగిందని వివరించారు. జిల్లాలో 600 మంది దాతలు ఈ కార్యక్రమానికి సహకరించారన్నారు. ఇదే స్ఫూర్తితో న్యూట్రీ గార్డెన్ (చికెన్ గార్డెన్) కార్యక్రమం కూడా విజయవంతం చేయాలని డీఈఓ కోరారు.

ఫిర్యాదులు పునరావృతం కాకూడదు



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

బొమ్మలసత్రం: వివిధ సమస్యలపై బాధితులు ఇచ్చే ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా పోలీసు స్టేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 110 వినతులు స్వీకరించారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించారు. మరి కొన్నింటిని ఆయా స్టేషన్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

కేసు నమోదుకు కలెక్టర్ ఆదేశాలు జారీ

నంద్యాల(న్యూటౌన్): పాణ్యం మండలం బలపనూరు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడుపై విద్యార్థి తండ్రి దాడి చేసిన ఘటనపై వెంటనే కేసు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాలు జారీ చేశారని డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని మందలించాడని తండ్రి ప్రధానోపాధ్యాయుడు నారాయణను కర్రతో కొట్టడం తగదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలోని ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం కలిగి ఉండాలన్నారు.

నందికొట్కూరు టీడీపీలో మూడుముక్కలాట

- కొరకరాని కొయ్యలా బైరెడ్డి
- టీడీపీలో లేకపోయినా చక్రం తిప్పుతున్న నేత
- చెల్లని కాసులుగా మాండ్ర, ఎమ్మెల్యే జయసూర్య
- ఫిర్యాదులను పెద్దగా పట్టించుకోని అధిష్టానం
- మున్సిపల్ ఛైర్మన్ చుట్టూ 'రాజకీయం'
- రెండు నెలలకే అధికార పార్టీలో విభేదాల రగడ

కండువా ఎగిరెగిరి.. మనసులు విరిగి!

ఒకరు రాజకీయంగా కనుమరుగయ్యారని భావిస్తున్న తరుణంలో కుమార్తె పదవితో తనదైన రాజకీయానికి తెర తీశారు.. జీవితంలో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి మరొకరు. వీరిద్దరి కంటే ముందు నుంచి నందికొట్కూరు రాజకీయాన్ని అన్నీ తానై నడిపిస్తున్న నేత ఇంకొకరు. అధికారం దక్కి 50రోజులు ముగియకనే ఈ ముగ్గురు నేతల మధ్య విభేదాలు వీధికెక్కాయి. సైకిల్ పార్టీతో సంబంధం లేని బైరెడ్డి నందికొట్కూరులో పెత్తనం చేస్తుంటే.. పెత్తనం చేయడానికి బైరెడ్డి ఎవరు? ఆయనకు టీడీపీతో సంబంధం ఏంటని ఎమ్మెల్యే జయసూర్య ధ్వజమెత్తుతున్నారు. మాండ్ర శివానంద రెడ్డి పెత్తనం చెలాయించాలని చూస్తున్నా అధిష్టానం సహకరించకపోవడంతో పార్టీ పరువు బజారున పడుతోంది. చివరకు ఈ పంచాయతీ అధిష్టానం వద్దకు చేరినా పరిష్కారం చూపలేక చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో నందికొట్కూరు 'తమ్ముళ్ల' విభేదాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం. – సాక్షి ప్రతినిధి కర్నూలు



బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి. మోతుబరి రాజకీయ నాయకుడే. రాజకీయం, ఆయనపై ఫ్యాక్షన్ ఆరోపణలు వెరసి 'సీమ'రాజకీయాల్లో కీలకంగా ఎదిగారు. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘంగా పనిచేసిన ఆయన 2012లో విభేదించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ భుజానికెత్తుకున్నట్లు 'రాయలసీమ పరిరక్షణ సమితి' పేరుతో రాజకీయ పార్టీ స్థాపించి ప్రత్యేక రాయలసీమ వాదాన్ని వినిపించారు. ఎలక్షన్‌లో పోటీ చేసి అట్టర్‌ఫ్లాప్ అయ్యారు. ఆపై కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ దెబ్బతో బైరెడ్డి రాజశేఖరరెడ్డి రాజకీయ జీవితం ముగిసిందని అంతా భావించారు. అయితే కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. సమకాలీన రాజకీయాల్లో బైరెడ్డి ప్రస్తావన లేకుండానే 2014, 2019లో కర్నూలు ఎన్నికలు ముగిశాయి. 2024లో తనతో పాటు బీజేపీలో ఉన్న కుమార్తె శబరిని టీడీపీలోకి పంపారు. ఈ చేరికలో శబరి మాత్రమే 'పచ్చకండువా' వేసుకున్నారు. బైరెడ్డి వేసుకోలేదు. నంద్యాల ఎంపీగా శబరి గెలుపొందారు.

పేరుకే శబరి.. అంతా బైరెడ్డే!

ఎన్నికల తర్వాత బైరెడ్డి నందికొట్కూరుపై తిరిగి పట్టుకోసం ప్రయత్నిస్తున్నారు. మునిసిపల్ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లను టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆపై మిడుతూరు, పగిడ్యాలలో ఎంపీటీసీ, సర్పంచ్‌లకు 'పచ్చకండువా' వేశారు. దీనిపై జయసూర్య తీవ్రస్థాయిలో స్పందించారు. 'టీడీపీలో చేర్చుకోవడానికి బైరెడ్డి ఎవరు? ఆయన టీడీపీ వ్యక్తి కాదు. టీడీపీలో చేరలేదు. సభ్యత్వం లేదు. కుమార్తె టీడీపీలో చేరినంత మాత్రాన ఈయన టీడీపీ అవుతారా?' అని ఘాటుగా స్పందించారు. ఆ తర్వాత బైరెడ్డి కూడా అదేస్థాయిలో స్పందించారు. 'నందికొట్కూరు తమ అడ్డా అని, కొందరు వస్తుంటారు.. పోతుంటారు!' అని ఎమ్మెల్యేను తేలిగ్గా కొట్టిపారేశారు. ఈ వ్యవహారం తర్వాత బైరెడ్డిపై జయసూర్య మాండ్ర శివానందరెడ్డితో కలిసి టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ తతంగం తర్వాత కూడా ఆదివారం బైరెడ్డి శివపురం ఎంపీటీసీ, మరికొందరికి కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఒక్కమాటలో చెప్పాలంటే తానే ఎంపీ అనే భావనలో నందికొట్కూరులో బైరెడ్డి రాజకీయం సాగిస్తున్నారు

మునిసిపల్ ఛైర్మన్ మార్పు బైరెడ్డికి చెక్ పెట్టేందుకేనా?

బైరెడ్డికి చెక్‌పెట్టేందుకు మాండ్రశివానందరెడ్డి కొత్త ఎత్తుగడ వేసినట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి పార్టీ నుంచి చేరిన సుధాకర్‌రెడ్డి టీడీపీ వ్యక్తి కాదని, అలాంటి వ్యక్తిని మునిసిపల్ ఛైర్మన్‌గా కొనసాగించొద్దని ఎమ్మెల్యే, మాండ్ర అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే 4ఏళ్ల వరకూ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టలేని పరిస్థితి. ఈక్రమంలో సుధాకర్‌రెడ్డి నిజంగా టీడీపీపై విశ్వాసంతో పార్టీలో చేరి ఉంటే ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి పార్టీలో కొనసాగాలే ఆదేశించాలని పార్టీ పెద్దలకు చెప్పినట్లు సమాచారం. రాజీనామా చేస్తే ఛైర్మన్ పదవి ఖాళీ అవుతుంది. అప్పుడు టీడీపీ కౌన్సిలర్‌ను ఛైర్మన్ చేయొచ్చు అనేది మాండ్ర ఎత్తుగడ. ఇందుకు నాలుగేళ్ల వరకు ఆగాల్సిన పని కూడా లేదు. ఇదే జరిగితే బైరెడ్డికి చెక్ పెట్టినట్లే. లేదంటే మాండ్రతో పాటు దళిత ఎమ్మెల్యే జయసూర్యను టీడీపీ లైట్‌గా తీసుకున్నట్లే!!

ఎమ్మెల్యే, మాండ్రకు టీడీపీ ప్రాధాన్యత ఇవ్వడం లేదా?

- బైరెడ్డి చర్యలను పట్టించుకోకపోవడం చూస్తే టీడీపీ పరోక్షంగా ఆయనను సమర్థించినట్లే కనపడుతోంది.
- మొన్నటి ఎన్నికల్లో మాండ్ర శివానందరెడ్డి నంద్యాల ఎంపీ టిక్కెట్ ఆశించి భంగపడ్డారు.
- శబరికి ఎంపీ టిక్కెట్ ఇచ్చే సందర్భంలో నందికొట్కూరు టిక్కెట్ మాండ్ర చెప్పిన వారికే ఇచ్చేలా ఒప్పందం జరిగింది. ఆ మేరకు జయసూర్య ఎమ్మెల్యే అయ్యారు.
- ఇప్పుడు బైరెడ్డి చర్యలను టీడీపీ సమర్థిస్తూ, జయసూర్యను పట్టించుకోవం లేదంటే మాండ్రను పక్కనపెట్టినట్లేనని టీడీపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.
- ఒకవేళ ఈ వివాదానికి చెక్ పెట్టాలనుకుంటే బైరెడ్డిని టీడీపీలో చేరాలని అధిష్టానం సూచించాలి. అదీ చేయలేదు.
- చేరికల సమయంలో ఎమ్మెల్యేను కలుపుకుని వెళ్లాలని చెప్పాలి. అలా కూడా జరగలేదు.
- టీడీపీలోని ముఖ్య నేతలందరితో బైరెడ్డికి సంబంధాలు ఉన్నాయి. అందువల్లే ఆయన ముందు జయసూర్య తేలిపోతున్నారు.
- పైగా జయసూర్య దళిత ఎమ్మెల్యే కావడంతో బైరెడ్డి లెక్కపెట్టడం లేదని తెలుస్తోంది.
- టీడీపీ కూడా అదే కోణంలో చూస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
- రెండేళ్ల తర్వాత డీలిమిటేషన్‌లో రిజర్వేషన్లు మారితే జయసూర్యకు రాజకీయ భవితవ్యం కూడా ఉండదనే ప్రచారం బైరెడ్డి వర్గం చేస్తోంది.

పేదల జీవితాలతో సీఎం చంద్రబాబు చెలగాటం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

బొమ్మలసత్రం: ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పేరుతో హామీలు గుప్పించిన సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పుడు వాటిని చూస్తే భయమేస్తుందని చెప్పి పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా విమర్శించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు భయమేస్తుందని అసెంబ్లీ సాక్షిగా చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులైనప్పటికీ ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. శాంతిభద్రలతలు కూడా పరిరక్షించలేక పోతున్నారని విమర్శించారు. వినుకొండలో నడిరోడ్డుపై జరిగిన హత్యనే ఇందుకు నిదర్శనమన్నారు. ఒక్క హామీని కూడా సరిగా అమలు చేయకుండా టీడీపీ ప్రభుత్వం పేదలను మోసం చేస్తుందన్నారు. అమలు చేయలేని పథకాలను ఎందుకు చెప్పి ఓట్లు దండుకోవాలని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం పిల్లలకందరికీ వర్తింప చేయలేమని, తల్లికి మాత్రమే ఇస్తున్నామని చెప్పటం సరైందికాదన్నారు. ప్రజలను మోసం చేస్తే రానున్న రోజుల్లో పేదల తరుపున రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్ర స్వామి మఠానికి హుండీల ద్వారా రూ.3.69 కోట్ల ఆదాయం సమరికూరింది. సోమవారం రాజ్యాంగణ భవనంలో మఠం మేనేజర్ శ్రీనివాస రావు నేతృత్వంలో హుండీల్లో కానుకల లెక్కింపు చేపట్టారు. మొత్తం 32 రోజులకు గాను రూ. 3,69,35,189 ఆదాయం వచ్చింది. అందులో నగదు రూపేణా రూ. 3,61,21,649. నాణేల రూపంలో రూ. 8,13,540 వచ్చింది. బంగారు 0.75 గ్రాములు, వెండి 1.900 గ్రాములు సమకూరినట్లు శ్రీమఠం మేనేజర్ తెలిపారు.

13 మంది ఏఎస్‌ఐలకు పదోన్నతి

- ఉత్తర్వులు జారీ చేసిన డీఐజీ ప్రవీణ్

కర్నూలు: పోలీసు శాఖ రాయలసీమ జోన్ పరిధిలో 13 మందికి ఏఎస్‌ఐలకు ర్యాంక్ ప్రమోటీ ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో అరుగురు కర్నూలు, ఒకరు కడప, ఇద్దరు అనంతపురం, ఇద్దరు చిత్తూరు, ఇద్దరు తిరుపతి జిల్లాలకు చెందినవారు ఉన్నారు. సీనియారిటీ జాబితాను పరిగణనలోకి తీసుకుని సబార్డినేట్ రూల్స్ ప్రకారం వారికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో కర్నూలుకు చెందిన ఒకరు, అనంతపురానికి చెందిన ఇద్దరు నంద్యాల జిల్లాకు, తిరుపతికి చెందిన ఇద్దరు చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. మిగిలినవారు ఆయా జిల్లాల్లోనే విధులు నిర్వహించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పదోన్నతి పొందిన వారు

పేరు	ప్రస్తుత స్థానం	కేటాయించిన స్థానం
డి.ప్రకాష్‌రావు	కడప	కడప
ఎస్.నాగరాజరావు	కర్నూలు	కర్నూలు
ఓ.శంకర్ రావు	కర్నూలు	కర్నూలు
ఎస్.టి.జమీర్	కర్నూలు	కర్నూలు
బి.శ్రీరాములు	కర్నూలు	కర్నూలు
ఆర్.వి.సుబ్బయ్య	కర్నూలు	కర్నూలు
జి.మాసన్న	కర్నూలు	నంద్యాల
బి.మోహన్	అనంతపురం	నంద్యాల
రామాంజనేయులు	అనంతపురం	నంద్యాల
జి.నాగరాజు	తిరుపతి	చిత్తూరు
ఎస్.శివకామిని	చిత్తూరు	చిత్తూరు
జి.పార్థసారధి	తిరుపతి	చిత్తూరు
సత్యనారాయణ	చిత్తూరు	చిత్తూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ పద్మజ, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వినతులపై సత్వరమే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలోని క్షేత్రస్థాయి సిబ్బంది తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలోని సిబ్బంది ఆర్‌డీఓ కార్యాలయాలలో కచ్చితంగా హాజరై వినతులు స్వీకరించాలన్నారు. ఇక నుంచి ఎవరైనా ఇష్టానుసారంగా అర్జీదారులకు ఎండార్స్‌మెంట్లు ఇస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి నియోజకవర్గానికి, మండలానికి స్పెషల్ అధికారులను నియమించి అభివృద్ధిని పర్యవేక్షిస్తామన్నారు. ప్రజల కోసం పెట్టిన గ్రీవెన్స్ రోజు సిబ్బందికి ఎలాంటి సెలవులు మంజూరు చేయమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రజుమంలో 171 వినతులు అందాయని, వీటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



తిరుపతి రూరల్: విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంస్థ పరిధిలోని ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల పరిధిలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీడర్ ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్‌పై నిరంతరం సమీక్షిస్తూ, వాటిని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలందించేందుకు వీలుగా వాట్సాప్, చాట్ బోట్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైతే వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంస్థ పరిధిలో దీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న విద్యుత్ బకాయిల వసూలుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్లు 1912, 1800 425 155333కు కాల్ చేయడం, చాట్ బోట్, 91333 31912 నంబరుతో వాట్సాప్ చాట్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సమీక్షలో చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, పద్మ, సూపరింటెండింగ్ ఇంజనీర్లు సురేంద్ర నాయుడు, విజయన్, రమణ, ఉమాపతి, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి వరద ఉధృతి

- శ్రీశైలానికి వరద ఉధృతి
- మూడు గేట్లు తెరిచి సాగర్‌కు నీటి విడుదల

బిరబిరా కృష్ణమ్మ



మూడు గేట్ల నుంచి దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

శ్రీశైలంప్రాజెక్ట్: గత కొద్ది రోజులుగా శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద పోటెత్తడంతో కృష్ణమ్మ బిరబిరామంటూ నాగార్జున సాగర్ వైపు ఉరకలు వేస్తోంది. జలాశయ నీటి మట్టం గరిష్టస్థాయి చేరువ అవుతుండటంతో సోమవారం సాయంత్రం చీఫ్ ఇంజినీర్ కబీర్‌బాషా, ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేశారు. మూడు రేడియల్ క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర తెరచి 82,000 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మరో వారం రోజులపాటు ఎగువ ప్రాజెక్టుల నుంచి వరద ఉధృతి కొనసాగే అవకాశంతో పాటు లోకల్ క్యాచ్‌మెంట్‌లో కూడా వర్షాలు కురుస్తాయని సెంట్రల్ వాటర్ కమిషన్ ముందస్తు హెచ్చరిక నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు వరద ప్రవాహాన్ని బేరీజు వేసుకొని డ్యామ్ అధికారులు సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో సాగర్‌కు నీటిని విడుదల చేశారు. జలాశయ నీటి మట్టం గరిష్టస్థాయి 885 అడుగులు కాగా ప్రస్తుతం 879.20 అడుగులుగా, 184.2774 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆదివారం నుంచి సోమవారం వరకు విద్యుత్ ఉత్పత్తి అనంతరం రెండు కేంద్రాల నుంచి సాగర్‌కు 64,152 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 15,792 క్యూసెక్కులు వెరసి శ్రీశైలం నుంచి 81,632 క్యూసెక్కుల నీరు విడుదలైంది. కుడిగట్టు కేంద్రంలో 15.44 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 18.69 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

ప్రాజెక్ట్‌ల నిర్వహణకు రూ.224 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్ట్‌ల నిర్వహణ కోసం రూ. 224కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదన లు పంపామని చీఫ్ ఇంజినీర్ కబీర్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్ట్‌లో ప్లంజ్‌పూల్, బ్లాక్‌ల పటిష్టత, గ్యాలరీ, గేట్ల నిర్వహణ, అప్రోచ్‌రోడ్ తదితర పనుల కోసం రూ.200 కోట్లతో డ్రిప్ పథకం కింద ప్రపంచ బ్యాంకు నిధులు సమకూరనున్నాయన్నారు. అలాగే రూ.24 కోట్లతో శ్రీశైలం, పోతిరెడ్డిపాడు, సుంకేసుల తదితర ప్రాజెక్ట్‌ల నిర్వహణ కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు విడుదల కాగానే ప్రాజెక్ట్‌లకు అవసరమైన మరమ్మతులు చేపడతామన్నారు. శ్రీశైలంలో ఆగస్టు మొదటివారంలో నీటి నిల్వలు గరిష్టస్థాయికి చేరుకుంటాయని భావించామని, అయితే వరద ప్రవాహం పెరగడంతో ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా స్పిల్‌వే ద్వారా నీటిని విడుదల చేస్తున్నామన్నారు. నాగార్జున సాగర్ డ్యాం కూడా గరిష్ట స్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నాయన్నారు.


రూ.35 కోట్ల వైద్య పరికరాలు



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో బిగిస్తున్న పరికరాలు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు సోమవారం రూ.35 కోట్ల విలువైన వైద్యపరికరాలు వచ్చాయి. వీటిని గత ప్రభుత్వం కొనుగోలు చేసింది. సదరు కంపెనీలు వీటిని తరలించే ప్రక్రియ ఆలస్యం కావడంతో అవి ఇప్పటికి చేరుకున్నాయి. ఇందులో రూ.30 కోట్ల విలువ చేసే లీనాక్, రూ.5 కోట్లు విలువ చేసే 4డీ సీటీ సిమ్యులేటర్ మెషీన్లు ఉన్నాయి. వీటిని సంబంధిత ఇంజనీర్లు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అమరుస్తున్నారు. అమర్చిన తర్వాత వీటిని వినియోగంలోకి తెస్తామని డైరెక్టర్ డాక్టర్ సీఆర్‌కే ప్రకాష్ తెలిపారు.

సస్యరక్షణ చర్యలు కీలకం



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు

పగిడ్యాల: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు కీలకమని ఆర్‌ఏఆర్‌ఎస్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. పగిడ్యాలలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగైన ఎస్‌ఎంహెచ్ 777 రకం మొక్కజొన్న, వీబీఎన్8 మినుము, ఆశా రకం కంది పంటలను శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నీలిమా, డాక్టర్ పి.పుల్లిబాయ్, డాక్టర్ బీవీ రవిప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఎం. శివరామకృష్ణ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలను ఆశించే చీడపీడలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు బెడద అధికంగా ఉంటుందని దీనిని నియంత్రించడానికి వేసవి దుక్కులను లోతుగా దున్నుకోవాలని, పంట చుట్టు నాలుగు వరుసలు నేపియర్ గడ్డిని ఎరపంటగా వేసుకోవాలని సూచించారు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు. కత్తెర పురుగు గుడ్లు గుర్తించి ఎకరానికి ఒక లీటర్ వేపనూనే లేదా 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. మినుము పైరులో కలుపు గడ్డిని ఎప్పటికప్పుడు తొలగించుకుంటే చీడపీడలు ఆశించవని స్పష్టం చేశారు. వారి వెంట స్థానిక మండల వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్, రైతులు పరమేష్, బొల్లవరం వెంకటేశ్వర్లు, గుంపుల వెంకటేశ్వర్లు ఉన్నారు.

మల్లన్న సేవలో అడిషనల్ డీజీపీ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఏపీ అడిషనల్ డీజీపీ ఆర్‌కె. మీనా దంపతులు దర్శించుకున్నారు. సోమవారం మల్లన్న దర్శనార్థం ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో వారికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు.

పెద్దాసుపత్రికి ఎన్ఆర్ఐల విరాళం

● రూ.1.35కోట్లకు పైగా వైద్యపరికరాలు అందించేందుకు సుముఖత
● జూమ్ కాన్ఫరెన్స్‌లో ఒప్పించిన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి కర్నూలు మెడికల్ కాలేజీలో విద్యాభ్యాసం చేసి విదేశాల్లో స్థిరపడిన(ఎన్ఆర్ఐ) పూర్వ విద్యార్థులు చేయూతనందించేందుకు ముందుకు వచ్చారు. కేఎంసీ పూర్వ విద్యార్థులైన ఎన్ఆర్ఐలతో ఆదివారం రాత్రి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ, ప్రస్తుత స్థితి గురించి వివరించారు. ఈ ఆసుపత్రికి ప్రతిరోజూ 3వేల మంది పేదరోగులు చికిత్స కోసం వస్తుంటారని, నిత్యం 1200 మందికి పైగా రోగులు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుంటారని తెలిపారు. ఇక్కడ విద్యాభ్యాసం చేసిన వా రు మాతృసంస్థకు చేయూతనందిస్తే ఎంతో మంది పేదలకు మేలు చేకూరుతుందని చెప్పారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఎన్ఆర్ఐలు చేయూతనందించేందుకు ముందుకు వచ్చారు. యూఎస్‌లో స్థిరపడిన డాక్టర్ కృష్ణారెడ్డి(1962బ్యాచ్) రూ.30లక్షల విలువజేసే మూడు అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్లు, ఈఎన్‌టీ ఎండోస్కోప్ మిషన్, కర్వ్‌లీనియర్ ప్రోబ్‌లను అందించేందుకు అంగీకరించారు. ఆయనతో పాటు మరో వైద్యుడు రూ. ఒక కోటి విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వీరితో పాటు కేఎంసీ ఆనా గ్రూప్ వారు ట్రస్ట్ ద్వారా రూ.5లక్షలు ఇవ్వనున్నారు. దీంతో పాటు మరో వైద్యుడు రేడియాలజీ విభాగంలోని ఎక్స్‌రే మిషన్‌లకు 8 ఫ్యూజి క్యాసెట్‌లను ఇవ్వడానికి అంగీకరించారు. తన అభ్యర్థనను మన్నించి వైద్యపరికరాలను అందించేందుకు అంగీకరించిన ఎన్ఆర్ఐలకు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

సబ్‌రిజిస్ట్రార్ నియామకం

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్‌గా ఎస్.అబ్దుల్ రఫాయి ఫిరోజ్‌ను నియమించారు. ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ పనిచేసిన జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్ విధి నిర్వహణలో అలసత్వం, అక్రమాలకు పాల్పడడంతో రెండు రోజు ల క్రితం సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో ఎస్.అబ్దుల్ రఫాయి ఫిరోజ్‌ను నియమించారు. ఫిరోజ్ ప్రస్తుతం బేతంచెర్లలో డెప్యూటేషన్‌పై ఎస్ఆర్‌గా పనిచేస్తున్నా రు. ఆయన ఒరిజినల్ స్థానం మాత్రం ప్యాపిలి. ఇదిలాఉండగా కర్నూలు జాయింట్–2 సబ్‌రిజిస్ట్రార్ పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉండడం గమనార్హం.

మల్లన్న సేవలో..



శ్రీశైలం టెంపుల్:శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నా రు. సోమవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు రాజగోపురం వద్ద ఈఓ డి. పెద్ది రాజు, అర్చకు లు, వేదపండితులు స్వాగతము పలికారు. తరువాత న్యాయమూర్తి దంపతులుస్వామివారికి అభిషేకాన్ని, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ఆర్చన మండపంలో న్యాయమూర్తికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు వేదాశీర్వచనంతో ఆశీర్వదించారు. దేవస్థానం ఈఓ స్వా మి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

వీబీఆర్‌కు చేరుతున్న కృష్ణా జలాలు

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. ఈ నెల 27న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ ద్వారా వీబీఆర్‌కు అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. సోమవారం 12 వేల క్యూసెక్కుల నీరు వచ్చింది. ఇదే ప్రవాహం కొనసాగితే తెల్లవారే సరికి వీబీఆర్‌లోకి 3 టీఎంసీల నీరు వచ్చే అవకాశం ఉంది.

సమావేశం నీరుగారి..!

● ఐఏబీ సమావేశం పక్కదారి
● నీటి కేటాయింపులపై చర్చించని వైనం
● రిజర్వాయర్‌ల మరమ్మతులు, నిధులపైనే ఎక్కువ చర్చ
● సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ నింపాలన్న మంత్రులు ఫరూక్, బీసీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యేలు

నంద్యాల: రిజర్వాయర్లు, సాగునీటి కాల్వల పరిధిలోని ఆయకట్టు పండేలా నీటి కేటాయింపులపై నిర్వహించిన ఐఏబీ (ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు) సమావేశాన్ని పాలకులు నీరుగార్చారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశం పక్కదారి పట్టింది. ప్రతి ఐఏబీ సమావేశంలో ప్రాజెక్టుల వారీగా ఖరీఫ్ పంటలకు ఉన్న నీటి లభ్యత, తాగు, సాగునీటిపై ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు చర్చిస్తారు. ఈ సమావేశంలో మాత్రం తాగు, సాగు నీటి కేటాయింపులకు అధిక ప్రాధాన్యత ఇవ్వకుండా రిజర్వాయర్‌ల మరమ్మతులు, వాటికి కావాల్సిన నిధులపైనే ఎక్కువ సేపు చర్చించారు. ముందుగా జిల్లా జలవనరుల అధికారి వెంకటరమణయ్య మాట్లాడుతూ తుంగభద్ర, సుంకేసుల బ్యారేజీ, శ్రీశైలం జలాశయం, అలగనూరు జలాశయం, వెలుగోడు జలాశయం, గోరుకల్లు జలాశయం, అవుకు జలాశయం, శివభాష్యం ప్రాజెక్టులలో ఉన్న గరిష్ట నీటి నిల్వ పరిమాణం టీఎంసీలలో ఇప్పటి వరకు చేరిన నీరు వంటి వివరాలు తెలియజేస్తూ వచ్చారు. 'ఈ ప్రాజెక్టుల నీటి వివరాలు మాకు అన్ని తెలుసు, ప్రాజెక్టులు, రిజర్వాయర్ల మరమ్మతులకు నిధులు ఉన్నాయా, ప్రతిపాదనలు పంపారా' అని కొందరు ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. ప్రభుత్వానికి తక్షణమే అవసరమైన నిధుల ప్రతిపాదనలు పంపామని, జిల్లా జలవనరుల అధికారి తెలపగా 'మాకు తెలియకుండా ప్రతిపాదనలు ఎలా పంపిస్తావని' ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రతిపాదనలు తెలియజేయాలని కోరగా ఐఏబీ సమావేశంలో నిధుల విషయంపై ఎప్పుడు చర్చ జరగలేదని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, కేటాయింపులపైనే చర్చ జరిగేదని, మరమ్మతులకు పంపిన నిధుల వివరాలు తీసుకొని రాలేదని చెప్పడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు జలవనరుల శాఖ అధికారి ఎస్ఈపై మండిపడ్డారు.

వైఎస్సార్‌సీపీకి బాగా పని చేశావా..

కేసీ కెనాల్‌కు నీటి విడుదల విషయంపై చర్చ జరుగుతుండగా కేసీ కెనాల్‌కు నాలుగేళ్లుగా ఖరీఫ్, రబీకి నీరు విడుదల చేశామని గత ఏడాది మాత్రమే రబీ పంటకు విడుదల చేశామని కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వరరెడ్డి చెబుతుండగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కల్పించుకొని ఏం తిరుమలేశ్వరరెడ్డి వైఎస్సార్‌సీపీకి బాగా పని చేశావ్.. అని చెబుతుండగా వెంటనే రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కల్పించుకొని బాగా పని చేశాడా అని ఎమ్మెల్యేని అడగగా వైఎస్సార్‌సీపీ నాయకులకు బ్రహ్మాండంగా పని చేశాడని కలెక్టర్, జిల్లా అధికారులు రైతుల ముందే చెప్పడంతో ఈఈ చిన్నబుచ్చుకున్నాడు. రెండు జిల్లాల సమావేశానికి హాజరైన అధికారులు సైతం ఎమ్మెల్యే, మంత్రి మాట్లాడిన మాటలు చూసి ఆశ్చర్యపోయారు.

వరద జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోండి...

కృష్ణా, తుంగభద్ర నదుల నుండి వచ్చే వరద జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు భవనములు, మౌలిక వసతుల సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి జల వనరుల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కృష్ణా, తుంగభద్ర నదుల నుండి భారీ ఎత్తున వరద ప్రవాహాలు కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్ని నీటితో నింపేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు. నదుల అనుసంధానం చేయడం ద్వారా ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ శాసనసభ్యులు, రైతులు, సాగునీటి సంఘాల సభ్యులు మంత్రులు తీర్మానించిన అంశాలను ప్రభుత్వానికి పంపించి తక్షణ చర్యలు చేపడతామన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా అన్ని రిజర్వాయర్లను నింపేందుకు సంబంధిత అధికారులతో పర్యవేక్షిస్తానన్నారు. డోన్ శాసనసభ్యులు జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తరహాలోనే వరద జలాలను వృథా చేయకుండా డ్రా చేసి ప్రాజెక్టులను నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మకూరు శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సిద్దాపురం, శివ భాష్యం, బానకచర్ల నుంచి కాలువల ద్వారా వెళ్లే ప్రవాహాల తూములు, స్లూయిస్‌ల మరమ్మతులకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత మాట్లాడుతూ కేసీ కెనాల్ చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు వెలగమన్ డ్యాం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య మాట్లాడుతూ కేసీకెనాల్ 0 నుండి 130 కిలోమీటర్ల వరకు మరమ్మతులు చేపట్టి స్థిరీకరించిన ఆయకట్టుకు నీరు అందించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు వరదరాజులు, ఆది నారాయణ రెడ్డి, నంద్యాల జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, కడప జేసీ అధితిసింగ్, కర్నూలు, నంద్యాల జిల్లాల ఇరిగేషన్ ఎస్ఈలు శేఖర్ రెడ్డి, వెంకటరమణ, ఆర్డీవోలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం.దాసు, అన్ని సాగునీటి ప్రాజెక్టుల ఈఈలు, డీఈ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలోని తీర్మానాలు...

➡ 2024–25 సంవత్సరానికి ఖరీఫ్ పంటలకు గాను తెలుగు పథకం కింద ఆగస్టు ఒకటో తేదీ నుంచి 1000 క్యూసెక్కుల నీటిని వరి నాట్ల కోసం నీటిని విడుదల చేస్తూ, రోజురోజుకు పెంచుకుంటూ స్థిరీకరించి ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి.
➡ ఎస్సార్ బీసీ కాలువ ద్వారా ఆగస్టు నుంచి 1.13 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలి.
➡ కేసీ కాలువ కింద 1,75,388 ఎకరాలకు నీటిని అందించాలి.
➡ శివ భాష్యం ప్రాజెక్టు కింద 8 వేల ఎకరాలకు ప్రాజెక్టులో నీరు చేరిన వెంటనే విడుదల చేయాలి.
➡ కృష్ణ యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి.
➡ తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం.

పొలం గట్టు విషయంలో ఘర్షణ.. ఒకరు మృతి

● ఎనిమిది మందిపై హత్య కేసు నమోదు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మృతుడు బోయ కామయ్య (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పొలం గట్టు విషయంలో ఘర్షణ జరిగి బోయ కామయ్య(54) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ కామయ్యకు, అతని అన్న దివంగత బోయ యంకన్న కుమారులు బోయ గోపాల్, బోయ వీరేష్‌ల మధ్య కొంత కాలంగా పొలం గట్టు విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇరువురూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావటంతో గ్రామ పెద్దలు సర్ది చెప్పేవారు. సోమవారం ఉదయం బోయ కామయ్య, అతని రెండో కుమారుడు పెద్దయ్య పొలం పనులకు వెళ్లారు. పక్కా ప్రణాళికతో బోయ గోపాల్, అతని భార్య ఉరుకుందమ్మ, అతని తమ్ముడు వీరేష్ మరికొందరితో కలసి పొలం దగ్గరకు వెళ్లారు. పొలం గట్టుపై రాళ్లు వేసుకునే విషయంలో కామయ్యతో బోయ గోపాల్ వాగ్వాదానికి దిగాడు. గొడవ పెద్దది కావటంతో బోయ గోపాల్‌తో పాటు అక్కడికి వచ్చిన వారు గడ్డపార, చలికె, కర్రలతో కామయ్యపై దాడి చేశారు. తన తండ్రిపై దాడిచేయటంతో పెద్దయ్య భయంతో ఇంటికి పరిగెత్తి విషయం కుటుంబ సభ్యులకు తెలిపారు. కామయ్య భార్య లింగమ్మ, కుమారులు తిమ్మప్ప, పెద్దయ్య కుటుంబ సభ్యులు పొలం దగ్గరకు వెళ్లగా.. గోపాల్, వీరేష్, మిగతా వారు పరార్ అయ్యారు. తీవ్రంగా గాయపడిన కామయ్యను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. దాడి విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఎమ్మిగనూరు ఇన్‌చార్జి డీఎస్పీ శివనారాయణస్వామి, రూరల్ సీఐ మోహన్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతుడి పెద్దకుమారుడు తిమ్మప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయ గోపాల్, బోయ ఉరుకుందమ్మ, బోయ వీరేష్, బోయ రామకృష్ణ, బోయ రామయ్య, బోయ మహదేవ, నాగిరెడ్డి, బోయ నారాయణ.. మొత్తం ఎనిమిది మందిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

ఏమార్చి.. ఏటీఎం కార్డు మార్చి

● రూ.43 వేల డబ్బులు డ్రా
● ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు: ఏటీఎం కార్డు మార్చి డబ్బులు డ్రా చేసుకున్న వారిని గుర్తించి న్యాయం చేయాల్సిందిగా కర్నూలుకు చెందిన దేవరాజు ఎస్పీ బిందు మాధవ్‌కు ఫిర్యాదు చేశారు. తన భార్య జయమ్మ కర్నూలు కొత్తబస్టాండ్ దగ్గర ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం గదిలోకి డబ్బులు డ్రా చేయడానికి వెళ్లగా డబ్బులు రాలేదని దేవరాజు తెలిపారు. ఆమె బయటకు వస్తుండగా ఇద్దరు వ్యక్తులు గదిలోకి వెళ్లి తాము డబ్బులు డ్రా చేసి ఇస్తామని నమ్మబలికి ఏటీఎం కార్డు ఇప్పించుకున్నారన్నారు. ఏమార్చి మరో కార్డు ఆమె చేతిలో పెట్టి వెళ్లిపోయారని, పది నిమిషాలకే రూ.43 వేలు డ్రా చేసినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చిందన్నారు. మోసం చేసిన వారిని గుర్తించి న్యాయం చేయాలని దేవరాజు కోరారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ బిందు మాధవ్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 105 మంది వచ్చి తమ సమస్యలను చెప్పుకున్నారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

➡ వెటర్నరీ ఆసుపత్రిలో అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలు పాతబస్తీకి చెందిన కత్తిర రాజు రూ.లక్ష తీసుకుని మోసం చేశాడని, విచారణ జరిపి న్యాయం చేయాలని కర్నూలు బుధవారపేటకు చెందిన షేక్ మహబూబ్ బాషా కోరారు.
➡ 40 ఏళ్ల క్రిందట కొనుగోలు చేసిన నాలుగు సెంట్ల స్థలాన్ని తమ్ముడు భార్య మునెమ్మ బంధువులతో కలసి ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తోందని దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామానికి చెందిన నాగమ్మ ఫిర్యాదు చేశారు.
➡ బావ సోమన్న ధాన్యం కోసం తనను కొట్టి గాయపరిచాడని వెల్దుర్తి మండలం లక్ష్మీపల్లె గ్రామానికి చెందిన కాంతమ్మ ఫిర్యాదు చేశారు.
➡ తన కుమారుడు సురేష్ బీటెక్ పూర్తి చేశాడని, అతనికి ఉద్యోగం ఇస్తానని బీజేఆర్ ఇన్ఫోటెక్ జేసువర్ధన్ రాజు రూ.80 వేలు తీసుకుని మోసం చేశాడని డోన్ పట్టణానికి చెందిన జంబులయ్య ఫిర్యాదు చేశారు.
➡ కావ్యశ్రీ రియల్ ఎస్టేట్ పేరుతో ప్లాట్లు ఇస్తామని కంతులు కట్టించుకుని ఆఫీసు ఎత్తేసి కొందరు పేదలను మోసం చేశారని పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామానికి చెందిన దుడుమన్న, చిన్నహుల్తి గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.
➡ నాగలాపురంలో ఉన్న రెండు ఎకరాల పొలాన్ని ముగ్గురు వ్యక్తులు కౌలుకు తీసుకుని ఆక్రమించుకోవడానికి దౌర్జన్యం చేస్తున్నారని కర్నూలు చల్లా వారి వీధికి చెందిన జ్ఞానేశ్వరమ్మ ఫిర్యాదు చేశారు.

పొదుపు మహిళల విజయం స్ఫూర్తిదాయకం

● కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్‌చంద్ర
● పొదుపు సంఘాలకు రూ. కోటి రుణాల మంజూరు



కెనరా బ్యాంక్ ప్రతినిధులతో రూ. కోటి మెగా చెక్కును అందుకుంటున్న విజయభారతి

ఓర్వకల్లు: ఓర్వకల్లు పొదుపు మహిళలు సాధించిన విజయం దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలిచిందని కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్‌చంద్ర అన్నారు. స్థానిక బాలభారతి పాఠశాల ఆవరణలో స్వయం సహాయక సంఘాలకు చేయూత కార్యక్రమాన్ని కెనరా బ్యాంక్ సౌజన్యంతో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి అశోక్‌చంద్రతో పాటు తిరుపతి ప్రాంతీయ జనరల్ మేనేజర్ మిథున్ సాయి, ఏజీఎం గౌతమ్, మండల మహిళ సమాఖ్య గౌరవ సలహాదారులు విజయభారతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పొదుపు మహిళల ఆర్థిక సౌజన్యం రూ.7 కోట్లతో నిర్మించిన బాలభారతి పాఠశాలను పరిశీలించి అభినందించారు. అనంతరం ఈడీ అశోక్‌చంద్ర మాట్లాడుతూ.. కెనరా బ్యాంక్ అమలు చేస్తున్న ఆరోగ్య బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఏడాది రూ.20 ప్రీమియంతో రూ.2లక్షల ప్రమాద బీమా పొందవచ్చన్నారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా పథకం ద్వారా ఏడాదికి రూ.436 ప్రీమియంతో రూ.2లక్షల వరకు జీవిత బీమా రక్షణ పొందవచ్చని తెలిపారు. ఏంజిల్ పథకం ద్వారా ఒక్క సారి రూ.5 వేలు వ్యక్తిగత ఖాతాల్లో వేసుకుంటే రూ.3 లక్షల వరకు క్యాన్సర్ బీమా, రూ.8 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం పొందవచ్చని పేర్కొన్నారు. సమాఖ్య గౌరవ సలహాదారులు విజయభారతి మాట్లాడుతూ.. మండలంలో 12 వేల మంది సభ్యులకు గాను ఇప్పటివరకు వెయ్యి మందితో ఏంజిల్ ఖాతాలను ప్రారంభించామన్నారు. మిగతా సభ్యులతో కూడా ఖాతాలు ప్రారంభించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వెయ్యి మంది సభ్యులతో ఏంజిల్ ఖాతాలను తెరిపించడంతో కెనరా బ్యాంక్ వారు రూ.50 లక్షల పారితోషిక చెక్కును సమాఖ్యకు అందజేశారు. అనంతరం పొదుపు సంఘాలకు మంజూరు చేసిన రూ.కోటి రుణాలకు సంబంధించి మెగా చెక్కును పొదుపు మహిళలకు అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన ఎస్‌హెచ్‌జీ సభ్యులు, బ్యాంక్ సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.

హత్య చేసి.. సరిహద్దు గ్రామంలో పడేసి!

● ఆస్తి కోసం దారుణం



సంఘటన స్థలంలో వివరాలను సేకరిస్తున్న సీఐ మన్సూరుద్దీన్



మృతుడు చిన్న శేషిరెడ్డి

సి.బెళగల్: ఆస్తి కోసం సొంత అన్ననే హత్య చేసి, సరిహద్దు గ్రామంలో మృతదేహాన్ని పడేసిన ఘటన సోమవారం సి.బెళగల్ మండలం కొత్తకోటలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు... సోమవారం వేకువజామున టీఎస్ 33డీ 2622 అనే స్కూటర్‌పై మృతదేహాన్ని తీసుకుని ఇద్దరు వ్యక్తులు సి.బెళగల్ మండలంలోని పోలకల్ గ్రామ శివారులో యానపై పడేసి పోయేందుకు ప్రయత్నించారు. అయితే పోలకల్ గ్రామానికి చెందిన గొర్రెల కాపర్లు గమనించి అరవడంతో నిందుతుల అక్కడి నుంచి శవంతో కొత్తకోట గ్రామం వైపు వెళ్లారు. గొర్రెల కాపర్ల నుంచి విషయాన్ని తెలుసుకున్న ఈర్లదిన్నె, కె.సింవగరం, కొత్తకోట గ్రామాల ప్రజలు అప్రమత్తమై వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. మృతదేహంతో స్కూటర్‌పై వెళ్తున్న నిందుతులను ఫొటోలను కొంత మంది సెల్‌ఫోన్‌లో బంధించారు. దీంతో నిందుతులు శవాన్ని కొత్తకోట గ్రామం దాటాక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా రోడ్డు పక్కనున్న గోతిలో పడేసి వెళ్లారు. స్థానికుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న కోడుమూరు సీఐ మనుసూరుద్దీన్, సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. విచారణలో హతుడు చిన్న శేషిరెడ్డి(49) అలియాస్ అగ్గిపుల్ల అని, తెలంగాణ రాష్ట్రం గద్వాల జోగులాంబ జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడకు చెందిన వ్యక్తి అని తేలింది. రాజోలి పోలీస్ స్టేషన్‌లో గతంలో ఆస్తి తగాదాలతో పలుమార్లు ఫిర్యాదులు ఉన్నాయని తెలుసుకున్నారు. చిన్న శేషిరెడ్డిని చంపింది సోదరుడు చిన్న నాగిరెడ్డి, మరో సోదరుడు పెద్ద శేషిరెడ్డి కుమారుడు మహేష్‌రెడ్డి అని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. హత్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. నిందులు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని ఆయన వెల్లడించారు. కాగా.. మృతుడికి భార్య పద్మావతి, పెళ్లికాని ఇద్దరు కుమారులు, పెళ్లి అయిన ముగ్గురు కుమార్తులు ఉన్నారు.

క్లుప్తంగా

మల్లన్న సేవలో..



ఆలయ ఆవరణలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్

శ్రీశైలం టెంపుల్:శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నా రు. సోమవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు రాజగోపురం వద్ద ఈఓ డి. పెద్ది రాజు, అర్చకు లు, వేదపండితులు స్వాగతము పలికారు. తరువాత న్యాయమూర్తి దంపతులుస్వామివారికి అభిషేకాన్ని, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ఆర్చన మండపంలో న్యాయమూర్తికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు వేదాశీర్వచనంతో ఆశీర్వదించారు. దేవస్థానం ఈఓ స్వా మి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

●టాటా ఇండికా కారు సీజ్.. వ్యక్తి అరెస్ట్



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్‌పోలీసులు

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా సరఫరా చేస్తున్న రూ.1.50 లక్షలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు సెబ్ ఇంచార్జ్ సీఐ మల్లిక తెలిపారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. సోమవారం ఉదయం తెల్లవారు జామున 3.15 గంటలకు ఆలూరు పట్టణంలోని స్థానిక గుంతకల్లు చెక్ పోస్టులో సెబ్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఇండికా కారులో తరలిస్తున్న 30 బాక్సులు కర్ణాటక మద్యం (2,880 టెట్రా ప్యాకెట్లు 90 ఎంఎల్) గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. టాటా ఇండికా కారును సీజ్ చేసి, ఆలూరుకు చెందిన అశోక్ అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని ఆలూరు మండలంలోని మొలగవల్లి గ్రామానికి ఎరుకల సుధాకర్, శ్రీనివాసులు అనే వ్యక్తులకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. అశోక్‌తో పాటు వీరిద్దరిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. సుధాకర్, శ్రీనివాసులను పట్టుకునేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామని ఆలూరు సెబ్ ఇంచార్జ్ సీఐ మల్లిక తెలిపారు. అలాగే హాలహర్వి మండలం పచ్చారపల్లి సమీపంలో ఆదివారం రాత్రి అనుమతి లేకుండా వంకల్లో నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకున్నామన్నారు. రూ.10 వేలు జరిమానా విధించి ట్రాక్టర్ రిలీజ్ చేశామన్నారు. సెబ్ ఎస్ఐ వీర స్వామి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది విజయుడు, చంద్రన్న, రామలింగమ్మ పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

కావలెను
అనుభవం గల MBBS Doctor & ఆపరేషన్ థియేటర్స్ అసిస్టెంట్స్ మరియు రిసెప్షనిస్టులు కావలెను. సంప్ర: విజయ హాస్పిటల్, రెవెన్యూ కాలనీ, నంద్యాల రోడ్, కర్నూలు.
సెల్: 94945 16163, 94402 32903

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DMLT ADMISSIONS
■DMLT 2 సం॥ల కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) అర్హులైన వారికి స్కాలర్ షిప్ కలదు. మా కాలేజ్ నందు స్టేట్ ర్యాంకులు 1st & 6th to 14th వరకు. # SEEDS కాలేజ్, కమలానగర్, ATP. 9440255034. [A-1297]

REAL ESTATE
■ కర్నూలు–నంద్యాల రోడ్, రాగమయూరి ప్రక్కన 30x45 సైజులో ఇల్లు కట్టించి ఇవ్వబడును. మరియు ఓర్వకల్లు, తిప్పాయిపల్లె రోడ్‌లో నూతన వెంచర్‌లో తక్కువ ధరకు ప్లాట్లు కలవు. ✆ 9963800314. [L-794230]

SERVICES
బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6525]

WANTED
■ఓర్వకల్లు నందు సోలార్ కంపెనీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. వివరాలకు సం.ప్ర: 9390430299, 6300661761. [L-794231]
■ కర్నూలు జిల్లా, ఓర్వకల్లు నందు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్ కావలెను. Q: 10th పాస్, 12గం. డ్యూటీ. PF, ESI కలవు. Age: 45 సం॥లోపు. 9390430299, 9440087632. [A-1296]

■ యర్రగుంట్ల ప్రముఖ సిమెంటు ఫ్యాక్టరీలో అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 8 గం॥, PF, ESI & వీక్లీ ఆఫ్స్, వ: 25-40, Q: 10th Pass & above. ✆ 95057 25641, 92463 25282 [B-782141]
■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీ రూం+భోజనం.HYD.Ph: 6309020999 [HA-432]
■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యా భర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14415]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



